# గుడిలో గంటలు X

రచన :
శ్రీమతి ఎం. సావిత్రి దేవి.

రాజయ్య గంగాపురము వారందరికి నోటిలో నాలుక వంటివాడు. ఆతని అండలేనిదే గ్రామంలో చాలా కార్యకలాపాలు జరగవు. అతనేమీ మోతుబరైన రైతుకాడు, ధనిక వ్యాపారస్తుడు కాడు. కేవలము వ్యవసాయ కూలీ. ఇనాముల రద్దుకు పూర్వము అతడు ఎంతో కొంత భూమిని కౌలుకి సాగుచేస్తుండేవాడు. దర్మిలా ఆతనికి ఎవరూ సాగుకి భూమికి కౌలుగాలివ్వ లేదు. ఎవరి భూమిని వారే స్వంతంగా సేద్యం చేసుకుంటున్నారు. అప్పటి నుండీ ఆతడు ఉదరపోషణార్థము అనేక వృత్తులను అవలంభిస్తూ వచ్చాడు. వేగు చుక్క పొడవక పూర్వమే లేస్తాడు. వెంటనే ఏదో వ్యాపకములో మునిగిపోతాడు. ఒకప్పుడు వలలు నేసి సమీపములో ఉన్న చెరువుల్లోను, కాలువల్లోను, గోతులలోను చేపలు పడతాడు. తెలతెలవారుతూ ఉండగా కావిడి భుజాన్న వేసుకుని ఊరిలో కావలసిన ఇళ్ళకు మంచినీళ్ళు సరఫరా చేస్తాడు. భార్య వెంకమ్మ నూతి నుండి నీళ్ళు తోడటము, తాను కావిళ్ళు మోయటము. ప్రొద్దు రెండు బారల పైకి వచ్చినాక ఊరి శ్మసానము దగ్గిరా, తాటి తోపులలోను క్రిందపడిన కలపా, కలపా ఇంటికి జేర్చుతాడు. ఎండిపోయిన ఆకులు కూడా అప్పుడప్పుడు వంట చెరుకుగా తెస్తాడు. భార్య వెంకమ్మ రెండు పూటలకు కలిపి ఒకేసారి వండేసుంది. అప్పుడు అంబలి త్రాగి కొంతసేపు రాజయ్య కునుకు పాట్లు పడతాడు. వెంకమ్మ ఊరిలో ఇళ్ళకెళ్ళి బియ్యము దంచుటము, నీళ్ళు మోయటము, గానుగ ఆడటము వగైరా పనుల్లో పాల్గొని చేరెడు బియ్యం, జొన్నలు మొదలైన వాటితో ఇల్లు జేరుకుంటుంది. ఇంతలో రాజయ్య యథాప్రకారము కావిడ భుజాన్న వేసుకొని చీకటిపడ్డ వరకు నీళ్ళు మోస్తాడు.

రాజయ్యకు ఆ పని ఈపని అని అరమరికలేదు. అన్ని వృత్తులలోను ఆరితేరిన చేయి. వర్షాకాలంలో వలలు వేసి చేపలు పడతాడు. పెళ్ళిళ్ళ కాలంలో భరిణెలు తయారు చేసి, చుట్టు ప్రక్కల సంతలలో అమ్ముతుంటాడు. ఆతని చేతితో యిచ్చిన కుంకుమ భరిణె చిరకాలము మాంగల్యము నిలుపుతుందని పరిసర గ్రామాలలో ప్రతీతి. ఊరిలో అన్ని శుభకార్యాలలో పాల్గొని పందిళ్ళు వేయటము నుండి అక్షతలు జల్లేవరకు రాజయ్య లేని చోటుండదు. అట్లాగే అశుభకార్యంలోకూడ. ఊరిలో దొమ్మీలు జరిగి బుర్రలు బద్దలు కొట్టుకుంటే రాజీకి రాజయ్య ప్రత్యక్షం. చావు వస్తే ఏడు కట్లను తయారుచేయటము నుండి శవ దహనము చేసి తిరిగి వచ్చేవరకు రాజయ్య వెన్నంటే ఉంటాడు. వీటిలో పాల్గొనటము ప్రతి ఫలాపేక్ష కోరికాదు. అది అతని అస్తిత్వములో, స్వభావములో ఒక భాగమైపోయింది. దానిని పరోపకారమనండి, మరేమనండి. ఊరిలోని ప్రతీ కార్యకలాపములోను అతడొక భాగమైపోతాడు.

పై వ్యాపకాలన్నీ ఒక ఎత్తయితే యీ క్రింది రెండూ మరొక యెత్తు రాజయ్యకు. మొదటిది శివరాత్రి నాడు ఊరి ప్రజల ఇలవేలుపైన మల్లిఖార్జున స్వామి తిరణాలు. స్వామి ఆలయము ముందు పందిరి వేయటము, సమీపములోనున్న కోనేటి నుండె నీళ్ళు తెచ్చి కలారజల్లటము. రోజల్లా దీప ప్రమిదలలో గ్రామస్థులు తెచ్చిన నూనెను పోయటము. ఇవి అతనికి తన జీవితంలో అత్యంత మధురమైన ఘట్టాలు. శివరాత్రినాడు మల్లిఖార్జున స్వామి తిరణాలు అతని జీవితములో ఒక విద్యుల్లత. శివరాత్రి మరునాటి నుంచి వచ్చే ఏటి శివరాత్రికి అతడు లెక్కలు కట్టుతూ వుంటాడు. రెండవది తన గ్రామానికి గాని, మరే గ్రామానికైనగాని అగ్ని ప్రమాదము సంభవించినప్పుడు, మొదటిది అతని జీవిత మధురస్మృతి అయితే రెండవది అతనిలోని రౌద్రాన్ని, ప్రతాపాన్ని బయటకు లాగుతాయి. తిరణాల వేళ చూచిన రాజయ్య భక్తిమూర్తి. ఆర్ద్ర హృదయుడు. అగ్ని ప్రమాదమప్పుడు చూచిన రాజయ్య భయంకర మూర్తి రౌద్రమూపుడు.

భార్య వెంకమ్మకు అప్పుడప్పుడు మతి చలిస్తూ ఉంటుంది. వెర్రికేకలు వేయటము, ఊరిలో కనిపించిన వారినందరినీ తూలనాడటము, ఇంకా ఎన్నో వికారపు పనులు చేయటము ఆసమయములో ఆమెకు పరిపాటి అయిపోయింది. యీ పిచ్చికి కారణము యిదమిత్థమని తేల్చలేకపోయాడు రాజయ్య. అన్నట్లు చెప్పమర్చాను. రాజయ్యకు వైద్యంలోను, భూతవిద్యలోను, చెడుపు

విద్యలోను కూడ బాగా ప్రవేశముంది. ఊరిలో చాలా భూతబాధలు, మతిభ్రమణలు వదలకొట్టాడు. కాని తన భార్యను మాత్రము నయముచేసుకొనలేకపోయాడు. దీనికి ఆతడొక సులువు పద్ధతి కనిపెట్టాడు. పిచ్చి ప్రవేశించగనే ఆతడు వెంకమ్మకు నున్నగా గుండు చేయించేస్తాడు. తరువాత పిచ్చి కొద్దిరోజులుండిపోతుంది.

వెంకమ్మకు రాజయ్య అంటే అమిత ప్రేమ. స్వయానా మేనత్త కొడుకు. ఇప్పుడు ఇద్దరూ ఏభైయో పడిలోపడినా బావామరదళ్ళ వరసలోనే పరస్పరము పిలుచుకుంటారు. రాజయ్య తిండి తిననిదే వెంకమ్మ తినదు. ఒకవేళ రాజయ్య సకాలంలో ఇంటికి రాకపోతే వీధి, వీధీ, వాడ, వాడా గాలిస్తుంది. కనిపించిన ప్రతీమనిషినీ భోగట్టా చేస్తుంది. పిచ్చిలోకూడ మిగతా ప్రపంచాన్నంతా మరచినా యీ విషయం మాత్రం ఆమె మరువదు. రాజయ్య సకాలంలో అన్నం తినటానికి రాకపోతే ఆమెప్రాణం కొట్టుకుంటుంది. కొడుకు సూరిని, కూతురు దేవుడమ్మను అన్వేషణ నిమిత్తం చెరొక దిక్కుకు పంపుతుంది. రాజయ్య తిరిగివచ్చేవరకు పచ్చిమంచినీళ్ళు ముట్టదు. రెండుఘడియలైనా, రెండు గంటలైనా అంతే. అలాగ ఉండిపోతుంది. ఇంతకన్న నాకు కావలిసిందేమిటి అనుకుని లోలోన సంతోషంతో తబ్బిబ్బు అవుతాడు రాజయ్య.

కాలచక్రం దొర్లిపోతోంది. రాజయ్యకు జవసత్వాలుడుగుతున్నాయి. వెంకమ్మకు పిచ్చి త్వరత్వరగా వస్తున్నది. వచ్చి మునుపటికంటె ఎక్కువరోజులుండిగాని తిరుగుముఖం పట్టటములేదు. రాజయ్య అతి కష్టంమీద కూతురు దేవుడమ్మకు పట్నంలో ఒక సంబంధం కుదిర్చి ఊరిప్రజల సహకారంతో వివాహం చేసాడు. అల్లుడు రెండవ పెళ్ళివాడైనా, వయస్సుమళ్ళినవాడైనా గత్యంతరంలేదు. అన్ని లక్షణాలున్న వరుడు తనబోటి నిరుపేదకు అంత చవకగా దొరుకుతాడా? అల్లుడు పట్నంలో బట్టల దుకాణములో గుమాస్తా. వారిపొట్ట వారికి గడిచిపోతుంది.

పెళ్ళయిన అయిదవ నెలలో దేవుడమ్మ, చంకలో శిశువును పెట్టుకొని గంగాపురం చేరుకుంది. యీ శిశువెవరని అడిగాడు రాజయ్య. నీ మనుమడని జవాబిచ్చింది దేముడమ్మ. తనను భర్త కొట్టి, బయటికీడ్చి తగలేశాడని ఎడ్చింది. రాజయ్యకు ఇప్పుడంతా అర్థమైంది. అయితే దేవుడమ్మ ఇక్కడే కాలుజారిందన్నమాట! వాస్తవానికి తనకేం విషయం తెలియదు. కూతురుని చూచి రౌద్రుడైపోయాడు. దేవుడమ్మ గజగజలాడింది. రాజయ్య దేవుడమ్మను చావబాదాడు. ఎవ్వరా దుర్మార్గుడని పదేపదే ప్రశ్నించాడు. ఇంక కొట్టటానికి తన చేతులు నొప్పి పట్టినయి. ఒక మూలకు కాలితో త్రోసి పారేశాడు. మూడువ రోజున దేవుడమ్మ బిడ్డ నోట్లో ధాన్యపు గింజలు నాలుగైదు వేసింది. వెంటనే శిశువు ఊపిరాడక ప్రాణాలు విడిచాడు. రాజయ్య విచారించలేదు. ఈరండ పుత్రుడి చావుకి తానెందుకు విచారించాలి? దేవుడమ్మ ఒంటరిగా శిశువుని స్మశానంలో కప్పిపెట్టి తిరిగి ఇల్లు చేరుకుంది.

ఊరిలో గుస గుసలు, బుసబుసలు వినిపిస్తున్నాయి. కూతురు గర్భవతి అని తెలిసే రాజయ్య వివాహం త్వరత్వరగా కానిచ్చాడని, తిరిగి సిగ్గులేకరండ అయిన కూతుర్ని ఇంటిలో తెచ్చిపెట్టుకున్నాడని, శిశువుని అతడే చంపేశాడని అనేక వదంతులు ఆనోటా ఈనోటా అల్లుకొని పోయాయి. నిజంగా కష్టజీవి. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము ఉన్న రాజయ్యపై అభియోగాలు వీటికి బాధ్యుడు కాదని, నిర్దోషి అని యీ గుడ్డి లోకానికేమి తులుసు? అతడు కూతుర్ని ఎంత ద్వేషిస్తున్నాడో, ఎంత లోలోన కుమిలి కుళ్ళయి పోతున్నాడో యీ పిచ్చి లోకానికి ఎలాగ తెలియజెప్పటం?

దేముడమ్మ అంతటితో ఆగలేదు. పాలుపొంగే యౌవనము, మత్తెక్కిన శరీరమూ, పట్టణ పరిచయము ఆమె నిప్పుడు పూర్తిగా మార్చి తారుమారుచేసిన యీ ఊళ్లో పచ్చిన యువకులతో విచ్చల విడిగా సంచరిస్తున్నది. బస్సు డ్రైవర్లు, హోటలు సర్వర్లు, మిగతా కుర్రకారు ఒకరేమిటి? ఎవరు డబ్బు పారేస్తే ఆగడియ వారి సొత్తు దేవుడమ్మ. ఇప్పుడు ఆమె వేషభాషలు పూర్తిగా మారిపోయాయి. రంగేళీ రాణీలాగా తయారవుతుంది నిత్యమూ. అందమూ వచ్చింది, ఆనందంగాను ఉంది ఆమెకు యీ జీవితం.

రాజయ్యకు కూతురిపై అదుపు పూర్తిగా పోయింది. తానిప్పుడు పూర్వపు రాజయ్యకాదు. ఆ హుందాతనము, ఆఠీవి అంతర్ధానమై పోయాయి, నాటి స్థానే చెప్పలేనంత లజ్జ, అవమానము ఆతనిని ఆవరించాయి. వీధిలోకెళ్ళి పని చేద్దామంటే ఆతడు లజ్జా భారంతో కృంగి

వంగిపోయాడు. అదిగాక పూర్వములాగ గ్రామ ప్రజలు అతనికి పనులు చెప్పటం పూర్తిగా మానుకున్నారు. రెక్కాడితే గాని డొక్కాడదని తనకు ఏ పని లేక పోతే ఎలాగ కాలం గడపటము? గ్రామీణులు మాత్రము రాజయ్యకేమి హాయిగా కూతురు గడించిన దానిని తింటూ పనిచేయటం మానుకున్నాడని అనుకుంటున్నారు. తన కూతుర్ని విష పురుగులాగ చూస్తున్న తాను అది తెచ్చిన విషమును ఎలాగ తాకుతాడు? ఇట్లాగ చెప్పినా ఈ గుడ్డి లోకం నమ్మదు. దేవుడమ్మ వేరొక యింటికి బస మార్చింది.

గోరుచుట్టు పై రోకటిపోటు అన్నట్లు కొడుకు సూరి గతి అంతకన్న అధ్వన్నమైపోతున్నది. 24 గంటలు త్రాగుడు, జూదము తప్ప అతనికి వేరే ధ్యాస లేదు. చెల్లెలు దేవుడమ్మ దగ్గర కొచ్చి అడపాదడనా అల్లరి పెట్టూ ఉండటము. ఆమె తృణమో ఫణమో ఇస్తే తాగేయటము, మరల రావటం యిట్లాగ నడుస్తుంది అతని జీవితము. వృద్ధాప్యములో ఉన్న తండ్రిగాని, మతి చెడి ఉన్న తల్లిగాని అతని స్మృతిపథంలో లేరు.

ఇప్పుడు పూరు పూర్తిగా రాజయ్యను బహిష్కరించింది. ఊరిలోని వారంతా పెద్దమనుష్యులాయె! ఊరిలోని తప్పొప్పుల జాబితాను సక్రమంగా తయారుచేసి ఒప్పులను భద్రపరచి తప్పులను రూపుమాపే భారం పాపం ఆ వెర్రి భగవంతుడు వీరి భుజాలమీద పెట్టి తాను కైలాసంలో ధ్యాన ముద్రలో మునుగుతూ, పాల సముద్రపు మధ్యను పవ్వళిస్తూ లేక మానస సరోవరపు పద్మాలపై కూర్చొని వీణా గానం వింటూ కులాసాగా రోజులు గడిపేస్తున్నాడు. మరి ఆ బృహత్ భారాన్ని తమవంటి పెద్దలు మోయటమంటే మాటలా! సహకార సంఘం అధ్యక్షుడు మాలపేటలో కులుకుతూ వయ్యారి భామలతో సల్లాపాలాడుతూంటే యీ పెద్దలేమి చేశారో? పంచాయితీ అధ్యక్షులవారు మర్యాదగా మధ్యాన్ని మిట్ట మధ్యం తమ గృహానికే తెప్పించుకుని గుప్ చిప్ గా త్రాగేస్తుంటే యీ పెద్దలెందు కూరుకున్నారు? మునసబు కరణ మహాశయులు ఊళ్లో జరిగే దొంగ వస్తువుల్లో అరవాటా పంచుకుంటుంటే యీ పెద్దలేం చేస్తున్నారో? ఏ తప్పూ తాను స్వంతంగా చేయకపోయినా రాజయ్యమీద విరుచుకుపడటం మాత్రం తెలుసు యీ పెద్దలకు!

ఉన్నట్లుండి ఒక దుర్ముహూర్తాన వెంకమ్మ ప్రాణాలు వదిలింది భర్త వడిలో. ఊరిలో పిట్టమనిషి కూడా ఆదుకోలేదు. యీ చావు కార్యకలాపాల్లో. కూతురును రాజయ్య దగ్గిరకు చేరనీయలేదూ. ఆ పాపి హస్తాలతో తాకితే పతివ్రత అయిన తన భార్య మలినమవుతుందని అతని భావము. కొడుకు త్రాగుడు మత్తులో ఏ లోకంలో విహరిస్తున్నాడో? భార్య శవాన్ని చాకళ్ళ సాయంతో రుద్రభూమికి చేర్చి తనచేతులతో తానుగా చితికి నిప్పంటించి, మృతదేహము భస్మమైపోయేవరకు స్మశానంలో ఉన్నాడు రాజయ్య. తన దేహము, మనస్సు కూడ ఆ చితిలో కాలిపోయినట్లే, తాను నీడమాత్రం మిగిలాడు. చీకట్లు సంధ్యను మ్రింగేస్తున్నాయి. వెంకమ్మ చితాభస్మాన్ని జాగ్రత్తపరుచుకొని ఇల్లు జేరుకున్నాడు రాజయ్య. అది ఎంత భయంకర కాళరాత్రి. ఈ విశాల విశ్వంలో అతనిప్పుడు ఏకాకి. ఇంటిలో అడుగుపెట్టగానే త్రాగుడు మైకంలో గాఢ సుషుప్తిలో మునిగి ఉన్న కొడుకును చూసాడు. తాను వసారాలో పండుకోటానికి ప్రయత్నించాడు.

ఇంతలో ఊరు భగ్గుమన్నది. తన యిల్లు అందరి యిళ్ళతోపాటు కాలిపోతున్నది. తాను అకస్మాత్తుగా బయటకు దూకేడు. లోపల సూరి మంటలలో చిక్కుకుని ఉన్నాడు. ఇంకా తెలివిరాలేనట్లున్నది. ఒక్కసారి పుత్రప్రేమ పెల్లుబికింది. వెంటనే దేనినీ లెక్కజేయకుండా మంటల్లోకి దూకి లోనికి చొచ్చుకుపోయాడు. కొడుకుని అతి కష్టంమీద బయటికి మోసుకొచ్చాడు. ఇల్లప్పుడే సారంగం పడింది చూచాడు. సూరి ఎప్పుడో ప్రాణాలు వదిలాడు మరునాటి ఉదయము అదే మరుభూమికి కొడుకుని అర్పించుకున్నాడు రాజయ్య.

సనాతనమైన తన గృహాన్ని వదిలిపెట్టి ఆ మరునాడు సాయంకాలము రాజయ్య మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోకి చేరుకున్నాడు. ఇంకా శివరాత్రి చాలా దూరంలో ఉంది. అంతవరకు స్వామికి యిక్కడ అజ్ఞాతవాసమే. కనుచీకటి పడుతున్నది. కొలనుచుట్టూ ఉన్న కొబ్బరిచెట్లపై చిలుకలు, గోరువంకలు ఎడతెరిపిలేకుండా మధుర, మధురమైన శబ్దాలను ధ్వనింపజేస్తున్నాయి. దేవతలు వాద్యదుందుభిలు వాయిస్తున్నట్లున్నది ఆ శబ్దాలు. కొలనులోనుండి వస్తున్న గాలికి ఆకాశ స్తంభముపై గంటలు గలగల లాడుతున్నాయి. రాజయ్య స్వామి పరిసరాలు తుడుస్తున్నాడు. స్వామి నాగేంద్రుడై రాజయ్యను స్పృశించాడు. రాజయ్య వెంటనే నేలకొరిగాడు. నాగేంద్రుడు మరల స్వామిలో లీనమైయ్యాడు. నాగేంద్రునితోపాటు రాజయ్యకూడ స్వామిలో లీనమయ్యాడు. ఆకాశ స్తంభంపై గుడి గంటలు గల గల చప్పుళ్ళు చేస్తూనే ఉన్నాయి. రాజయ్యకు కైలాసంలో స్వాగతం పలికే గంటలు అవి. అతని ఆత్మశాంతికి నీరాజనము అవి.